

మెస్ ఛార్జీలు రూ.2500 పెంచాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్‌ఛార్జీలు రూ.2500కు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం 3,4 తరగతులకు రూ.1150, 5 నుంచి 10 తరగతులకు రూ.1400, ఇంటర్, ఆపై చదువులకు రూ.1600 పెంచినట్లు ప్రకటించడం దారుణమని అన్నారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ రావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ఐదేళ్లు అవుతోందని, నిత్యవసర ధరలు ఆకాశమంత ఎత్తు పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నామ మాత్రంగా మెస్‌ఛార్జీలు పెంచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూకు ఈ డబ్బులు ఏమాత్రమూ సరిపోవని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సంక్షేమ హాస్టల్లో పౌష్టికాహారం అందాలంటే నెలకు రూ.2500 పెంచాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం చేస్తామని అన్నారు.

అంటివలసలో విషాదం

అంతా ఒక ఊరి వారే.. ఒకే గిరిజన కుటుంబాలకు చెందిన సభ్యులే.. సమీపంలోని గ్రామానికి పెళ్లి చూపుల కోసం వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసి స్వగ్రామానికి ఆటోలో తిరిగి పయనమయ్యారు. విందు ముచ్చట్లు చెప్పుకొంటూ సరదాగా గడిపారు. మరి కాసేపట్లో గమ్యస్థానం చేరుకుంటారనగా, ఇంతలోనే ఉలికిపాటు.. రెప్ప మూసి తెరిచేలోపే నెత్తురు కారుతున్న చేతులు.. ముద్దయిన శరీర భాగాలు.. హాహాకారాలు.. అప్పటి వరకూ తమతోపాటు కబుర్లు చెబుతున్న వారే.. కళ్లెదురుగా విగతజీవులై పడి ఉన్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురు దుర్మరణం చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం చోళ్లపదం వద్ద చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది.



తల్లి శారద మృతి, తండ్రి అంధుడు కావడంతో అనాథలైన చిన్నారులు



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

- ఆటోను లారీ ఢీకొని ఐదుగురు దుర్మరణం
- పెళ్లి చూపులకు వెళ్లి వస్తూ మృత్యువాత

ప్రజాశక్తి-కొమరాడ, పార్వతీపురంరూరల్

కొమరాడ మండలంలోని దేవకోన పంచాయతీ అంటివలసకు చెందిన ఊయక లక్ష్మి కుమార్తె పెళ్లి సంబంధం కోసం ఒకే కుటుంబానికి చెందిన 13 మంది అదే మండలం చోళ్లపదం పంచాయతీ తుమ్మలవలసకు ఆటోలో వెళ్లారు. పెళ్లి చూపులు, భోజనాలు అనంతరం స్వగ్రామం వస్తుండగా చోళ్లపదం శివాలయం సమీపంలో పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వీరి ఆటోను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఊయక నర్సమ్మ (40), ఊయక లక్ష్మి (42), మెల్లిక శారద (35), మెల్లిక అమ్మడమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఊయక వెంకటి (50), ఆటో డ్రైవర్ ఊయక వెంకటేష్, ఆరిక ప్రసాద్‌ను స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో వెంకటి మృతి చెందాడు. స్వల్పంగా గాయపడిన మరో ఐదుగురిని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ జగదీష్‌నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఆటోలో ఇద్దరు చిన్నపిల్లలు కూడా ఉన్నప్పటికీ వారికి ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. మృతులంతా ఒకే గ్రామానికి, ఒకే కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. వెంకటేష్, ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిలో ఊయక లావణ్య, ఊయక కళావతి, ఊయక సత్యవతి, మెల్లిక కమల, ఊయక జయసుధ, ఊయక రామస్వామి ఉన్నారు. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి పరామర్శించారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

సంఘటనా స్థలాన్ని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. అధిక లోడ్ తో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీ కొనడం వల్లే ప్రాణ నష్టం ఎక్కువగా జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక బోర్డులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు తక్షణమే చర్యలు చేపడతామన్నారు. తక్షణమే ఓవర్ లోడ్లతో వెళుతున్న లారీలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయనతో పాటు అదనపు అదనపు దిలీప్ కిరణ్, సిఐ కొమరాడ ఎస్ఐ జగదీష్ నాయుడు తదితరులు ఉన్నారు.

అంటివలసలో మిన్నంటిన రోదనలు

పెళ్లి శుభకార్యానికి వెళ్లి తిరుగుముఖంలో సరదాగా మాట్లాడుకుంటూ వస్తున్న వారిని మృత్యువు రూపంలో లారీ కబళించడంతో అటు అటు మృతుల స్వగ్రామమైన అంటివలసతోపాటు, తుమ్మలవలస గ్రామంలోను విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటి వరకూ తమతోపాటు సందడిగా గడిపిన వారంతా.. ఇక లేరన్న విషయం తెలిసి గ్రామస్తులంతా ఉలిక్కిపడ్డారు. గ్రామంలోను, ఆసుపత్రిలోను మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన వరంతా రోజువారి కూలీలు, గిరిజనులు కావడంతో ఆ గ్రామంలో రోదనలు మిన్నంటాయి. ఒక్కొక్క కుటుంబానిదీ ఒక్కో విషాద గాథ. ప్రమాదంలో మతి చెందిన మెల్లిక శారద కుటుంబ పరిస్థితి చాలా దారుణం. భర్త శంకర్రావు రెండు కళ్ళు కనిపించకపోవడంతో ఇంటివద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సుస్మిత, శ్రావ్య, కుమారుడు రాఘవ ఉన్నారు. వీరి కుటుంబ పోషణంతా శారద రోజువారి కూలి పని చేస్తూ నెట్టుకొస్తుంది. శుభకార్యానికి వెళ్లిన తల్లి తిరిగి వస్తుందని పిల్లలు, భర్త ఎదురుచూస్తున్నారు. శారద భార్య రోడ్డు ప్రమాదంలో మతి చెందిన విషయం తెలిసి పిల్లలు ఇంటి వద్ద రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సిపిఎం కార్యకర్తగా ప్రజల పక్షాన పోరాడుతున్న ఊయక వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తమ కుటుంబంలో శుభకార్యం కావడంతో ఆటోలో భార్య, కుమార్తెను కూడా తీసుకెళ్లాడు. ప్రమాదంలో వెంకటేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో అతని భార్య లావణ్యకు కూడా తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కుమార్తె అలేఖ్య కూడా స్వల్ప గాయాలతో బయటపడింది. ఒకే కుటుంబంలో ఇలా ముగ్గురు ప్రమాదానికి గురి కావడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు వినిపిస్తున్నారు.

కుమార్తె పెళ్లి చూపులకు వెళ్లి వస్తూ ఊయక లక్ష్మి మృతి చెందడం, ఆమె భర్త రామస్వామి తీవ్రంగా గాయపడడంతో ఆకుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వీరికి కుమారుడు ప్రవీణ్, కుమార్తె స్నేహలత ఉన్నారు. ప్రమాదంలో మతి చెందిన అమ్మడమ్మకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు, నరసమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

క్షత గాత్రులకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న వెంటనే సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, కొమరాడ సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఏరియా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. మృతి చెందిన గిరిజన కుటుంబాలను ఐటిడిఎ అధికారులు, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.



క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నంటున్న సిపిఎం నాయకులు

బాల్య వివాహాలను అరికట్టాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- సఖి, సహేలీ గ్రూపుల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వ చట్టాలను వినియోగించి కఠిన చర్యలను తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, తల్లితండ్రులతోపాటు, వివాహం చేసే పురోహితులు, ఫాస్టర్లపైనా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టీనేజ్ గర్భాలను నివారించాలని, దీనికోసం బాలికలను చైతన్య పరచాలని సూచించారు. సఖి, సహేలీ గ్రూపుల నిర్వహణపై, కలెక్టరేట్ ఆడిటోరియం లో బుధవారం సమీక్ష నిర్వహించారు. సఖి, సహేలీ సమావేశాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. బాలికలు కూడా డిగ్రీవరకు చదువుకొనేలా వారిని చైతన్య పరచాలని, 21 ఏళ్లలోపు వివాహం చేసుకోకుండా చూడాలని కలెక్టర్ కోరారు. చిన్న వయసులోనే గర్భం దాల్చడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించాలని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతీనెలా సఖి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహిస్తూ, ఆ గ్రూపు సభ్యులతో మమేకం కావడం ద్వారా, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, జరగబోతున్న బాల్య వివాహాలను తెలుసుకొనే అవకాశం కలుగుతుందన్నారు. గ్రామస్థాయిలో, మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు జిల్లాలోని ఆరు మండలాల్లో సుమారు 53 వేలమంది గిరిజనులు ఉన్నారని, వారి సమస్యలపై దష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, గిరిజన సంక్షేమశాఖ డిడి మాట్లాడుతూ, తమ శాఖాపరమైన అంశాలను వివరించారు. సఖి గ్రూపులపై రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. సమావేశంలో ఎంపిడిఒలు, వైద్యాధికారులు, ఐసిడిఎస్ అధికారులు, మహిళా పోలీసులు, యునెసెఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరకాల వాంఛ నెరవేరింది

- ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో సామాజిక న్యాయం
- వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మాట్లాడుతున్న మజ్జిశ్రీనివాసరావు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 150 సీట్లతో తరగతుల ప్రారంభానికి అనుమతి ఇవ్వడం ద్వారా జిల్లా ప్రజలు చీరకాల వాంఛను ముఖ్యమంత్రి నెరవేర్చారని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జిశ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల ఈ ప్రాంత వాసులు కల, మెరుగైన వైద్య ధన్యవాదాలు తెలిపారు. టిడిపి ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పినా జీవో ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. 2019 ఎన్నికలు సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం సామాజిక న్యాయం చేస్తామని చెప్పిన విధంగా మహిళలకు 50 శాతం పదవులు ఇస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో 18 మందిలో 14 మంది ఎమ్మెల్సీ లు బిసి, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన వారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో రైతులకు,అక్కడి ప్రజలకు ఇవ్వాల్సిన అర్ అండ్ అర్, పునరావాస చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలు కోడ్ పూర్తయిన వెంటనే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదు

- రోజుకు రూ.25కోట్ల బిల్లులు మంజూరు
- నెలిపర్తి లేఅవుట్‌ను పరిశీలించిన హౌసింగ్ ఎమ్‌డి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత లేదని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా చెప్పారు. పట్టణంలోని నెలిపర్తిలో గల లేఅవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతవరకు ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. గృహ నిర్మాణంలో సమస్యలు తెలుసుకునేందుకు తాను జిల్లా పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. లేఅవుట్లలో ఏవిధమైన సమస్యలున్నా పరిష్కరిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు నాణ్యమైన సిమెంట్, ఇనుము తక్కువ ధరకు సరఫరా చేస్తున్నామన్నారు. లేఅవుట్లలో విద్యుత్, తాగునీరు, ఇంటర్నల్ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోజుకు రూ.25కోట్ల మేరకు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నెలిపర్తి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గుమడాం లేఅవుట్ -5లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అవసరమైతే మంజూరు చేస్తామని చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ రఘురాం, డిఇ సోమేశ్వర రావు, ఎఇ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, ఎఇ సూరి నాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పార్వతీపురం/ సీతానగరం : గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండి లక్ష్మీశా అన్నారు. తొలుత సీతానగరం మండలం కాసాపేటలో ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ప్రారంభంకాని ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పునాదులు, లింటల్, రూఫ్ స్థాయిల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ప్రతి వారం పురోగతి సాధించాలని ఆయన సూచించారు. విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ, కనెక్షన్ లేదని లబ్ధిదారులు తెలియజేయగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం మాట్లాడుతూ ఈ గ్రామంలో 8 ఇళ్లు పూర్తయ్యాయని, 26 ఇళ్లకు స్లాబ్ వేయాలని వివరించారు. మొత్తం 59 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని ఆయన చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ డిఇ ప్రసాద్, ఎఇ జానకీరాం, పంచాయతీ కార్యదర్శి మురళీ కృష్ణ, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఎఐసిసి కోఆప్షన్ సభ్యులుగా రమేష్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట



కేక్ కట్ చేస్తున్న డిసిసి అధ్యక్షులు రమేష్‌కుమార్

ఎఐసిసి కో ఆప్షన్ సభ్యులుగా విజయనగరం డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం రమేష్‌కుమార్ జన్మదినం కూడా కావడంతో కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల కేక్ కట్ చేసి రమేష్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖార్గే, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డోలా శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షరీఫ్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు రెహమాన్, నగర పార్టీ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, ఎస్. శ్రీనివాసరావు, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు పనిచేయాలి

రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్‌కుమార్

మానవాభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలని రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం, ఎందుకోసం చేస్తున్నాం అని ఆత్మావలోకనం చేసుకోవాలని అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు సుస్థిర అభివద్ధి, స్పందన కార్యక్రమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 సుస్థిర అభివద్ధి సూచీలను ప్రాధాన్యతలుగా తీసుకొని 2030 నాటికి శతశాతం సాధించే దిశగా లక్ష్యాలను నిర్ణయించుకున్నామని తెలిపారు. నీతి అయోగ్ అమలు చేస్తున్న 115 ఎస్‌డిజి సుచీలలో జిల్లా స్థాయిలో 61 , గ్రామ, వార్డు స్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మాపింగ్ చేవామన్నారు. జాతి నిర్మాణం లో ఉద్యోగుల పాత్ర కీలకమని, మనసు పెట్టి పని చేస్తే సంతప్తి మిగులుతుందని హితవు పలికారు.

నిర్ణీత గడువులో పరిష్కరించిన వారికి అభినందనలు

రెండు జిల్లాల్లో అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించినందుకు కలెక్టర్లను , అధికారులను సెక్రటరీ అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించడంలో , వాటిని సకాలం లో నెరవేర్చడం లో ప్రభుత్వం చిత్త శుద్ధి తో ఉందని అన్నారు. అర్జీ సమాధానం పంపిన 24 గంటల్లో అర్జీ దారు నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని తెలిపారు. ఎక్కువగా రెవిన్యూ, హౌసింగ్ , సచివాలయ సేవలు, సిబ్బందిపై అర్జీలు అందుతున్నాయని, ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో కూడా ఎందుకు ఎక్కువగా వస్తున్నదీ పరిశీలించాలని తెలిపారు.

జగనన్న కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధి : కలెక్టర్

కలెక్టర్ సూర్య కుమారి మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలలో మౌలిక వసతుల కల్పనలో జిల్లా ముందుందని తెలిపారు. ఎస్‌డిజి సూచీలలో మాతా, శిశు మరణాలను తగ్గించగలిగామని తెలిపారు. అయితే రక్త హీనత ఉందని, తగ్గించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే తినిపించేలా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కార్యకమం లో విజయనగరం సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒలు గణపతి రావు, వెంకటరావు, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటిక పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కీర్తిశేషులు బొద్దుల గురునాయుడు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ద్వారపూడి గ్రామంలో గురువారం ఉత్తరాంధ్ర పౌరాణిక నాటకాలు నిర్వహిస్తున్నామని బొద్దుల గురునాయుడు కుమారులు బొద్దుల నర్సింగరావు, బొద్దుల రమణ, బొద్దుల ఆనంద్ తెలిపారు. బుధవారం తమ స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 23వ తేదీన ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పౌరాణిక పద్య నాటిక పోటీలు, బహుమతి ప్రధానోత్సవం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ విభాగంలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు, ఐదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనే కళాకారులందరికీ అన్నిరకాల సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో బొద్దుల శివప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

విజయనగరం టౌన్ : జిల్లా సర్వజన ఆస్పత్రి, ఘషాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు కోరారు. బుధవారం ఈ ఆస్పత్రులను సందర్శించి రోగుల సమస్యలను, అడిగి తెలుసు కున్నారు. అనంతరం మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు మెరుగుపడాలని అన్నారు. రోగులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. కావలసిన వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి ప్రొఫెసర్ అయిన డాక్టర్ మాధురికి వినతి అందజేశారు. చోడిఆదినారాయణ, ఎస్ ఎస్ రెడ్డి, పట్నాల వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టుల పెండింగ్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - గుర్ల



రామతీర్థసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. మండలంలో తారకరామతీర్థ సాగర ప్రాజెక్టు బ్యారేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలసి సందర్శించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పరిశీలనలో భాగంగా తారకరామతీర్థ సాగర ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లడుతూ 2005లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ నేటి వరకు పూర్తి కాకపోవడం ప్రభుతాలు, పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇందుకు ప్రభుత్వాలు సిగ్గు పడాలన్నారు. ఎటువంటి ఆటంకాలు లేని ఈ ప్రాజెక్ట్‌కు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయడానికి ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిర్వాసితులకు రూ. 90 కోట్లు చెల్లించవలసి ఉందనీ, ఈ మాత్రం నిధులు ప్రభుత్వం వద్ద లేవా అని ప్రశించారు. రూ. 450 కోట్లు ఖర్చు చేస్తే ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి అవుతాయని, ఇందుకోసం ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రం కావాలన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు రెండుసార్లు రెవెన్యూశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా ఈ ప్రాజెక్టులు వెనుకబాటుతనం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో అసంపూర్తిగా ప్రాజెక్టలను చూసి మంత్రి ధర్మాన సిగ్గు పడాలన్నారు. రైతులు బాగు కోరేవారైతే ఈ విధంగా ఉండే వారు కాదన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు విషయంలో మోసం చేస్తుందన్నారు. రాష్ట్రం మొత్తం పర్యటించి పెండింగులో ఉన్న అన్ని ప్రాజెక్టులకు నిధులు కేటాయించలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామన్నారు. తారకరామా తీర్థ సాగర ప్రాజెక్టు పూర్తయితే నెల్లిమర్ల నియోజకవర్గలో ఉన్న పూసపాటి రేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరానికి తాగు నీరు అందుతాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు, జెవి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఓబులేష్, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు బుగత అశోక్, అలమండ ఆనందరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

బొబ్బిలి : బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముప్పల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. రైతు సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరై పదేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. విస్తరణ పనులు సగంలో నిలిపివేయడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రమాప్రభకు మద్దతుగా ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం ప్రజా సంఘాల నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలజంగిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు పి.సత్యంనాయుడు, వివిధ గ్రామాల్లో ప్రజా సంఘాల నేతలు స్వామినాయుడు, పి.శంకరరావు, ఎస్.గోపాలం, సురేష్ ప్రచారం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పెట్రోలు బంకు పరిశీలన


పెట్రోలు బంకును తనిఖీ చేస్తున్న అధికారులు

వేపాడ : మండల కేంద్రంలోని పెట్రోల్ బంకును బుధవారం సాయంత్రం రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించింది. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు పెట్రోల్ బంకు నిర్వహణపై పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టామని నివేదికను ఆన్‌లైన్‌లో అధికారులకు పంపుతామని సిఎస్‌డిటి రామకృష్ణ తెలిపారు. బంకుకు సంబంధించిన రికార్డులను, పెట్రోలు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వేపాడ హెచ్‌డిటి కె సన్యాసినాయుడు మాట్లాడుతూ వాహన చోదకులకు బంకు యాజమాన్యం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాంలో వీర బ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజులు పాటు జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళ వాయిద్యాలతో, గణేష్ ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం కుంకుమ పూజా, తీర్థ ప్రసాద వితరణ, శుక్రవారం వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ప్రతిష్టా కార్యక్రమం, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

పైడితల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

భోగాపురం : మండలంలోని పోలిపల్లి పైడితల్లి వారి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. దేవాదాయ శాఖ అధికారులు కే. శ్రీరామ్, విజయ్ ప్రసాద్ మరియు గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఏడాది ఉగాది నుంచి ఇప్పటివరకు హుండీ ద్వారా 2,39,316 రూపాయలు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ కర్రోతు పైడిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల పనితీరు ఆదర్శనీయం

కురుపాం : ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగు నీరందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఆదర్శనీయమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో గల మంతినివలస సమీపంలో ఎటర్నల్ లైట్ ట్రస్టు ఆధ్వర్యంలో కమ్యూనిటీ బోరు వెల్స్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా లక్ష రూపాయల వ్యయంతో తీసిన మంచినీటి బోరును బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సంధ్బంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు తాగు నీరందించడం అద్భుతమని, అలాగే గిరిజన గ్రామాల్లో గిరిజనులకు తాగు నీరందించడంతో పాటు, ప్రజాహిత కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వెన్నా విజయ్, కన్వీనర్ ఎస్.ప్రసంగి, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, జెడ్పీటిసి జి.సుజాత, స్థానిక సర్పంచ్ జి.సుజాత,ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, సంస్థ కార్యదర్శి జి.రామారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిసి కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండల కేంద్రంలోని బిసి కాలనీలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, వృద్ధులు, చంటి పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతకుమారి, ఎంఎల్‌హెచ్‌వి భాగ్యరాధ, ఎఎన్ఎం ఉష, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి కైలాసనాథ స్వామి జాతర

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలో గల కైలాసనాథ స్వామి జాతర ఈనెల 17 నుంచి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఎంతో అట్టహాసముగా నిర్వహించనున్న కైలాసనాథ ఆలయ వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా పంచమ రాత్రి యాత్ర కార్యక్రమాల ప్రణాళికలను ఆలయ గౌరవ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకోట విష్ణుప్రసాద్, ఆలయ ధర్మకర్త గుడ్ల వెంకటరావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నిర్వాహకులు మాట్లాడుతూ కైలాసనాథ స్వామి ఆలయ కమిటీ సమిష్టి కృషితో ప్రజలు, అధికారులు సహకారంతో జయప్రదం చేయాలని అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులను కలిసి యాత్ర నిర్వహణకు అనుమతులు కోరాలని, అలాగే ప్రతి కమిటీ సభ్యుడు బాధ్యతగా కార్యక్రమంలో పాల్గొని నిస్వార్థంగా సేవలు అందించాలని నిర్ణయించడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు సొంటేన సురేష్, పైడ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

సాలూరు: ఈనెల 25న పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మూడు ఆటోలు, నాలుగు ద్వి చక్రవాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు టౌన్ ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. శనివారం ఉదయం 10.30గంటలకు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆర్.సుధాకర్ పర్యవేక్షణలో వాహనాల వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేరాలు ఘోరాలు

బావిలో జారి పడి మహిళ మృతి

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి సోములమ్మ నెలబావిలో పడి మృతి చెందింది. పోలీసుల వివరాలు ప్రకారం.. సోములమ్మ సోమవారం వ్యవసాయ పని నిమిత్తం వెళ్ళింది. రాత్రికి ఇంటికి రాలేదు. బుధవారం పొలం పనులకు వెళ్లిన వారు భావిలో మృత దేహం వుండడం గమనించి సోములమ్మగా గుర్తించారు. ఆంద్ర పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని గజపతినగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త అప్పల నాయుడు, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బైక్ ఢీకొని సైకిలిస్టుకు గాయాలు

గంట్యాడ : మండంలోని కరకవలస సమీపంలోని పప్పుల మిల్లు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడికి గాయాలయ్యాయి. నరవ గ్రామానికి చెందిన ఎర్రిబోతుల చిట్టిబాబు భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న చిప్పాడ రమణ ఢీ కొన్నాడు.

ఇళ్లు అప్పగించకుండానే.!

● రుణాలకు ఇఎంఐ చెల్లించాలని సందేశం ● అయోమయంలో టిడ్కో లబ్ధిదారులు ● నత్తనడకన ఇళ్ల నిర్మాణ పనులు

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు అప్పగించకుండానే ఇల్లు కోసం మంజూరు చేసిన లోన్ ఇఎంఐ చెల్లించాలని బ్యాంకులు నుంచి లబ్ధిదారులకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఇల్లు అప్పగించకుండానే ఇఎంఐ చెల్లించాలని ప్రతినెల మెసేజ్‌లు రావడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. టిడిపి హయాంలో పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలను ప్రారంభించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభం కానీ ఇళ్లను రద్దు చేసి స్లాబ్ అయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో బొబ్బిలి మున్సిపాలిటీలో 300 చదరపు అడుగుల ఇల్లు 1344, 365 చదరపు అడుగుల ఇల్లు 48, 430 చదరపు అడుగుల ఇల్లు 288 పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. 300 చదరపు అపుగుల ఇంటికి రూ.6.55లక్షలు ధర నిర్ణయించగా అంతా ప్రభుత్వం భరించి లబ్ధిదారులకు ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 365 చదరపు గజాల ఇల్లుకు యూనిట్ ధర రూ.7.55లక్షలుగా నిర్ణయించగా లబ్ధిదారుని రూ.25వేలు కాగా, ప్రభుత్వం వాటా రూ.4.15 లక్షలు, బ్యాంకు రుణం రూ.3.15లక్షలు, 430 చదరపు అడుగుల ఇల్లు యూనిట్ ధర రూ.8.55లక్షలు కాగా లబ్ధిదారుని వాటా రూ.70వేలు కాగా ప్రభుత్వం వాటా రూ.4.25లక్షలు, బ్యాంకు రుణం రూ.3.60లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. 300 చదరపు అడుగుల లబ్ధిదారులకు ఇల్లు ఉచితం కావడంతో బ్యాంకు రుణాలు అవసరం లేదు. 365, 430 చదరపు అడుగుల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు అవసరం కావడంతో 365 కేటగిరీ, 430 చదరపు అడుగుల కేటగిరీలలో ఉన్న 336 మంది లబ్ధిదారులకు రుణాలు కోసం బ్యాంకులకు దరఖాస్తు చేశారు. వీటిలో 285మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరవ్వగా తొమ్మిది మంది బ్యాంకు రుణం తీసుకోకుండా లబ్ధిదారులే చెల్లించారు. బ్యాంకు రుణం తీసుకున్న లబ్ధిదారులకు ఇల్లు అప్పగించకుండానే నెలవారిగా రుణాలు చెల్లించాలని బ్యాంకులు మెసేజ్‌లు పంపడంతో భయాందోళన చెందుతున్నారు. రుణాలు చెల్లించకపోతే ఒకేసారి వడ్డీ చెల్లించాలని బ్యాంకులు డిమాండ్ చేస్తే తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.


బొబ్బిలిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

ఉగాదికి గృహ ప్రవేశాలు అయ్యేనా..

టిడ్కో ఇల్లు నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అద్దె ఇళ్లలో ఉండలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.


ఘనంగా పోవెల్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్కౌట్స్ గైడ్స్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ స్మిత్ బెడెన్ పావెల్ 166 జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా స్థానిక ఆదిత్య విద్యాలయంలో ఓపెన్ యూనిట్ సర్దార్ వల్లభాయ్ పటేల్, ఝాన్సీ లక్ష్మీబాయి యూనిట్ల ద్వారా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం, శ్రీకాకుళం అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజర్ కమిషనర్ కె. దుర్గా నాగేశ్వరరావు, జిల్లారోవర్ స్కౌట్ లీడర్ ఎస్. శ్రీనివాస్ శర్మ పాల్గొని మాట్లాడారు. ముందుగా బెడన్ పావెల్ చిత్రపటానికి పూలమాలవేసి స్కౌట్, గైడ్ మాస్టర్స్, విద్యార్థులు నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రి, స్థానిక మారుతీ ఆస్పత్రిల్లో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. స్కౌట్ విద్యార్థులచే స్కౌట్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాలయం, జెడ్పి గర్ల్స్ హై స్కూల్, బాయ్స్ హై స్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతోపాటు హెచ్ డబ్ల్యు స్కౌట్ మాస్టర్ డాక్టర్ సూరిబాబు, పాఠశాల హెచ్ఎం వి. అమృత, గర్ల్స్ హై స్కూల్ గైడ్ టీచర్స్ ఎం శైలజ, ఎం. సుజాత, బాయ్స్ హై స్కూల్ హెచ్ఎం. విజయలక్ష్మి స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.


రోగికి రొట్టెలను పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

వంగర: ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం సందర్భంగా వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులు చేసిన పిరమిడ్ విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు మాక్ డ్రిల్లు నిర్వహించి క్రమ శిక్షణతో ఉత్తమ విద్యను అభ్యశించాలని పాఠశాల ప్రిన్సిపాల్ బెవర ఈశ్వర రావు అన్నారు. విద్యార్థులకు ప్రపంచ స్కౌట్స్ డే ప్రాముఖ్యత తెలియజేశారు. ఉత్తమ పౌరులుగా తయా రవ్వాలని అన్నారు. స్కౌట్స్‌లో చేరిన వారికి ముఖ్యంగా క్రమశిక్షణతో కూడిన విద్య అలవడుతోందన్నారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బంది స్కౌ ట్స్ ఉపాద్యాయులు ఆర్ ఈశ్వర రావు సంతోష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మనాయుడు, పారినాయుడు, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.


పిరమిడ్ విన్యాసంలో విద్యార్థినులు

అయ్యో విజయ రామా సాగర్

● ఆక్రమణకు గురవుతున్న ప్రాజెక్టు
● పదెకరాల్లో కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్
● పట్టించుకోని యంత్రాంగం


సాగర్ గర్భంలో చదును చేసిన స్థలం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండ గంగపూడి గ్రామ సచివాలయ పరిధిలో గల విజయ రామ సాగర్ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కబంధ హస్తాలలో కుషించికపోతోంది. ఈ చెరువు ఆయకట్టు సుమారు 1000 ఎకరాల పైనే ఉంటుంది. విజయ రామ సాగర్ అభివృద్ధికి ప్రభుత్వాలు లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. కాగా ఈ విజయ రామ సాగర్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారి కన్ను పడింది. సుమారు పది ఎకరాల వరకు ఆక్రమించుకొని ప్లాట్లు వేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశాడు. ఇందులో భాగంగా ప్రాజెక్టు గర్భంలో సదును చేసి ప్లాట్లను తయారు చేస్తున్నారు. ఆక్రమణపై గ్రామ రెవెన్యూ అధికారిణిని వివరణ కోరగా సమాధానం దాటవేశారు. సాగర్ గర్భం కప్పేస్తే భవిష్యత్తులో సాగునీటికి మరిన్ని ఇబ్బందులు తప్పవని ఇప్పటికైనా ఆక్రమణలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన గ్రామాల ప్రజలు, ఆయకుట్టు రోతులు కోరుతున్నారు.

గ్రాడ్యుటీ బకాయిలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ యాజమాన్యం రిటైర్డ్ కార్మికులకు పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద ఆయన గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా యాజమాన్య ఒప్పందం ప్రకారం నెలకు 30 గ్రాడ్యుటీ బకాయి చెక్కులు ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదన్నారు. జ్యూట్ యాజమాన్యం సకాలంలో ఈఎస్ఐ, పిఎఫ్ కంట్రీ బ్యూషన్ చెల్లించక పోవడంతో రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు తమకు రావాల్సిన పిఎఫ్ నగదు పొందలేకపోతున్నారని, పింఛన్ సౌకర్యం అమలు జరగక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 2016లో రిటైర్డ్ అయిన కార్మికులకు జ్యూట్ యాజమాన్యం చెక్కులు ఇచ్చింది గాని అకౌంట్‌లో నగదు లేక గ్రాడ్యుటీ బకాయిలు అందడం లేదన్నారు. యాజమాన్యం ఇచ్చిన గ్రాడ్యుటీ చెల్లింపు చెక్కులు ఈ నెలతో కాల పరిమితి దాటిపోయి చెక్కులు మరి చెల్లవు కాబట్టి అకౌంట్లో నగదు వేయాలని డిమాండ్ చేశారు. కాగా జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి అప్పుగా తీసుకున్న 5,10,18 రూపాయలు ఒక్కొక్క కార్మికుడికి రూ.58వేలు తిరిగి ఇవ్వలేదన్నారు. యాజ మాన్యం వెంటనే స్పందించి ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించడంతో బాటు, 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, ఆందోళన చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికుల పాల్గొన్నారు.

సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండలంలోని నిడిగట్టు గ్రామంలో కొంతకాలంగా రెండు గ్రూపుల మధ్య వెంటాడుతున్న వివాదం ఎస్ఐ ఎం ముకుందరావు జోక్యంతో ఎట్టకేలకు బుధవారం సద్దుమణిగింది. గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి గ్రామంలో ఉన్న పైడితల్లి అమ్మవారి పురాతన గుడిని తీసివేసి అదే చోట కొత్త గుడి ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. వారి తీర్మానం మేరకు 2022 మే 28న పైడితల్లి అమ్మవారి పురాతన గుడి తీసివేసి నూతన గుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన చల్లా గోవిందు దంపతులు అప్పట్లో శంకుస్థాపన చేయగా, విరాళాల నగదు లావాదేవీల కొరకు సూరెడ్డి లక్ష్మణరావు, గుల్లిపల్లి కృష్ణకుమారి పేర్ల మీద జాయింట్ అకౌంట్ తీశారు. కొంతమేర నిర్మాణ పనులు బాగానే జరిగినప్పటికీ వారిలో వారికి ఏమైందో ఏమో తెలియదు గానీ గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఒక గ్రూపునకు చెందినవారు ఈనెల 20న మరో గ్రూపు వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తమపై ఫిర్యాదు చేశారని తెలుసుకున్న గ్రామస్తులు 21న అధిక సంఖ్యలో పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు స్పందించిన ఎస్ఐ గ్రామాన్ని సందర్శించి ఇరువురితో మాట్లాడుతూ ఒక్కో గ్రూపు నుండి ముగ్గురేసి చొప్పున కమిటీ వేసుకుని నాయకత్వం వహిస్తూ సక్రమంగా నిర్మాణం పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. విరాళాల డబ్బులు ఓకే జాయింట్ అకౌంట్‌లో భద్రపరుచు కోవాలన్నారు. ఈ చర్చలలో ఒక గ్రూపునకు చెందిన గుడివాడ మల్లునాయుడు , సూరెడ్డి లక్ష్మణరావు పాల్గొనగా మరో గ్రూపునకు చెందిన చల్లా గోవిందు, గుడివాడ ప్రసాదరావు పాల్గొన్నారు.

మాతృభాషను కాపాడుకుందాం

ప్రజాశక్తి- వేపాడ

తల్లి లాంటి పవిత్రమైన తెలుగు భాషను మనం కాపాడుకుందామని గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా సేవ జానపద కళా పీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు పిలుపునిచ్చారు. మండలంలోని సీతారాంపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా తెలుగు భాష సంరక్షణ కోసం వేమన, సుమతి, బద్దెన, శతక పద్యాల పఠన పోటీలు నిర్వహిస్తామ న్నారు. తల్లిదండ్రులు. ఉపాధ్యాయులు తెలుగుభాష ఆవశ్యకతను భావితరాలకు ఉపయోగపడే విధంగా భాషోద్యమానికి గట్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో కళా పీఠం సభ్యులు పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమ్మతల్లి పండగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో వెలసిన చిన్నమ్మ తల్లి పండగ ఈ నెల 27, 28 తేదీల్లో అంగరంగ వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా నిర్వహించే ఈ గ్రామ దేవత పండగకు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అమ్మవారి దర్శనాలకి వస్తారు. 27న తొలేళ్ల ఉత్సవంతో అంకురార్పణ జరిగి 28న ఘటాలకు పూజలు జరిపి భక్తులకు దర్శనాలకు అనుమతిస్తారు. సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణల నడుమ తిరువీధి మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ పండగకు ముందు ఆనవాయితీగా శిర్లి పోతన్న ఉత్సవాన్ని 26 ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కేంద్ర బృందం ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి - గజపతినగరం

మాస్ డ్రగ్ అడ్మిని స్ట్రేషన్ కేంద్ర బృంద పరిశీలకులు డాక్టర్ డి.జయరాం, రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ నితిన్, సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం మరుపల్లి పిహెచ్‌సి పరిధిలో గల కొత్తబగ్గం గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని, పాఠశాలలను సందర్శించి నులి పురుగులు, ఫైలేరియా మందుల పంపిణీ గురించి ఆరా తీసారు. గ్రామస్తుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. హెల్త్ వెల్నెస్ సెంటర్ నందు పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎంఒ ఎం.తులసి, ఎఎంఒ డివి రమణ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనూజ్ రాయ్, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారావు, సిహెచ్ఒ ఎన్.మంజు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం ప్రభావతి, ఆశ వర్కర్ భవాని తదితరులు పాల్గొన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

డాక్టర్లకు లైఫ్ సపోర్టుశిక్షణ

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్లకు బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ బుధవా రం ప్రారంభమైంది. 150 మంది జూనియర్ డాక్టర్లకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐఆర్‌సి నియమావళి ప్రకారం పూర్తి స్థాయి శిక్షణ వైద్య నిపుణులచే బోధించనున్నారు. ఈ శిక్షణలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈ మూడు రోజులు పాటు జరగనున్న శిక్షణను వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, అనస్థీషియా హెచ్ఒడి, డాక్టర్ డివిజి శంకరరావు, నైపుణ్య శిక్షకులు డాక్టర్ చైతన్య, డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న వైద్యులు


పంట నమోదును పరిశీలిస్తున్న ప్రేమ్‌శేఖర్, తదితరులు

పంట నమోదు తనిఖీ

గజపతినగరం : మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో రాష్ట్ర కేంద్రం కమిషనరేట్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.ప్రేమ్ శేఖర్ పంట నమోదును బుధవారం తనిఖీ చేశారు. అపరాలు, మొక్కజొన్న నమోదును పరిశీలించారు. ఈ క్రాప్ నమోదులో పొందుపరిచిన పంట జలధార వివరాలను స్థానిక రైతులతో, విఎఎ, విఆర్ఒలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయం నుండి ఎడిఎ కె.ప్రకాష్, గజపతినగరం సబ్ డివిజన్ ఎడిఎ కె.మహారాజన్, మండల వ్యవసాయాధికారి సిహెచ్ ధనలక్ష్మి, విఎఎలు వాసవి, వినయ్, పవన్, విఆర్ఒ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు..

వైసిపితో సామాజిక న్యాయం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల


వైసిపితో సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్‌బాబు తెలిపారు. ఆయనకు రెండోసారి ఎమ్మెల్సీ పదవి దక్కడంతో బుధవారం మొయిదలో ఆయన స్వగృహంలో పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో బిసిలు, దళితులు ఎస్‌టిలు, ఒసిలు నిర్లక్ష్యానికి గురయ్యారని అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అన్ని రంగాల్లో బిసిలు, దళితులు, ఎస్‌టిలు, ఒసిలకు పెద్ద పీట వేశారని కొనియాడారు. బిసిలకు వివిధ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అవకాశం కల్పించారని తెలిపారు. తనకు రెండోసారి అవకాశం కల్పించడంతో భాధ్యత పెరిగిందని పార్టీ పటిష్టతకు అందరి సహకారంతో మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, రామ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు దాట్ల సత్య నారాయణ రాజు, మొయిద సర్పంచ్ అట్టాడ కృష్ణ, పూతిక పేట మాజీ సర్పంచ్ యడ్ల గోవింద రావు, వైసిపి నాయకులు నల్లి చంద్ర శేఖర్, ఎంఎం నాయుడు, నల్లి శ్రీను, పి. అప్పల రాజు, తుమ్ము నారాయణ మూర్తి, కనకల హైమా వతి, మన్య పురి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీని సత్కరిస్తున్న నాయకులు

పనులు పరిశీలన

వేపాడ : మండలంలోని ముకుందపురంలో జరుగుతున్న శ్మశానానికి ప్రహరీ నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికార ఎమ్‌డి కుర్షిత్ అలీ బుధవారం పరిశీలించారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ నిర్మాణ పనులకు రూ. 4.90లక్షలు వెచ్చించామన్నారు. పనుల్లో నాణ్యత లోపం వస్తే బిల్లులు చెల్లించేది లేదని హెచ్చరించారు. ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ కనకరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అప్పలరాజు, కె. కుమార్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారి అలీ


ఎస్‌డబ్ల్యుపి షెడ్‌ను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

ఎస్‌డబ్ల్యుపి షెడ్ల పరిశీలన

వేపాడ : మండలంలోని మండలంలో సోంపురం, పాటూరు గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యుపి షెడ్లను ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. గ్రామ సచివాలయానికి సమస్యలపై వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కరించాల్నారు. ఈ కార్యక్రమంలో పాటూరు, సోంపురం పంచాయతీ కార్యదర్శులు సంధ్య, నాగమణి పాల్గొన్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లికి చెందిన బెవర మసేను (24) కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు సముద్రంలో వేటాడుతూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. ఈ విషయమై తోటి వేటగాళ్ల బుధవారం కుటుంబీకులకు సమాచారం అందించారు. సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందడంతో తోటి వేటగాళ్ల అతని మృతదేహాన్ని ఒడ్డికి చేర్చారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం చింతపల్లికి గురువారం తరలిస్తారని మత్స్య కర్ నాయకులు బర్రి చిన్నప్పన్న తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు.


మృతి చెందిన మసేను

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో గంట చిన్నమ్మి (62) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వంగర పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 20వ తేదీన తన కుమార్తెలు కళావతి, పుణ్యవతి గ్రామమైన నీలయ్య వలస నుంచి స్వగ్రామం కొండచాకరాపల్లికి బయలు దేరిన ఆమె ఆచూకి అదే రోజు మధ్యాహ్నం నుండి కనిపించలేదు. బుధవారం కొండచాకరాపల్లి రావి పొలం సమీపంలో మొక్కజొన్న పొలంలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. మృతురాలి కుమార్తె పుణ్యవతి స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. తన తల్లి మెడలో, చెవిలో ఉన్న బంగారు ఆభరణాలు పూర్తిగా గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుని తన తల్లిని హతమార్చి ఉంటారని ఆరోపిస్తూ తమ ఆవేదనను పోలీసులు ఎదుట వెల్లగక్కింది. రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర, వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం విజయనగరం డాగ్ స్క్వాడ్ బృందం ఇక్కడికి వచ్చి ఘటన జరిగిన ప్రదేశంలో తనిఖీలు నిర్వహించాయి. మృతదేహాన్ని రాజాం సిహెచ్‌సికి తరలించారు. ఆమె మెడలో ఉన్న బంగారు వస్తువులు కోసం గుర్తు తెలియని దుండగులు హత్య చేసి ఉంటారని భావిస్తూ హత్య కేసుగా నమోదు చేశామని సిఐ తెలిపారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ
